సెమీస్‌కు సంజూ, గిల్

థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల విజయ పరంపర కొనసాగుతున్నది. సోమవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లలో ఇద్దరు బాక్సర్లు తమ పంచ్‌లతో ప్రత్యర్థులను చిత్తు చేసి సెమీస్‌కు దూసుకెళ్లారు. మహిళల 60 కిలోల విభాగంలో సంజూతో పాటు పురుషుల 90+ కేజీల కేటగిరీలో అన్షుల్ గిల్ సెమీఫైనల్ చేరారు. సంజూ.. 5-0తో ఇండోనేషియా బాక్సర్ రేఖ మరియానాను ఓడించింది. మూడు రౌండ్ల పాటు గేమ్‌పై పూర్తి నియంత్రణ కొనసాగించిన ఆమె.. ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా విజయం సాధించింది. ఇక పురుషుల క్వార్టర్స్‌లో అన్షుల్ సైతం 5-0తో కజకిస్థాన్‌కు చెందిన డేనియల్ సపర్‌బెను మట్టికరిపించాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన అన్షుల్.. ప్రత్యర్థి విసిరే పంచ్‌లనూ సమర్థంగా అడ్డుకున్నాడు. సెమీస్‌లో అతడు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన రుస్తమోవ్‌తో తలపడనున్నాడు. తాజా విజయాలతో ఈ ఇద్దరూ పతకం ఖాయం చేసుకోవడం విశేషం.

సాత్విక్-చిరాగ్ జోడీ రీఎంట్రీ

- నేటి నుంచే సింగపూర్ ఓపెన్

సింగపూర్: మూడు నెలల స్వల్ప విరామం తర్వాత భారత డబుల్స్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఆటకు పునరాగమనం చేయనున్నారు. మంగళవారం నుంచి మొదలుకాబోయే బీడబ్ల్యూఎఫ్ సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో ఈ ప్రపంచ మాజీ నెంబర్ వన్ జోడీ బరిలోకి దిగనున్నారు. ఈ ఏడాది మార్చిలో ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్ ఆడిన సాత్విక్-చిరాగ్ జంట.. ఆ తర్వాత పలు కారణాలతో కీలక టోర్నీలకు దూరంగా ఉంది. తొలి రౌండ్‌లో ఈ భారత జోడీ.. మలేషియా ద్వయం చూంగ్ హోన్-మహ్మద్ హైకల్‌తో తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి పోటీలో ఉన్నారు. ఇక మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు భారత బృందాన్ని నడిపించనుంది. సింధుతో పాటు అన్మోల్ ఖర్బ్, మాళవిక బన్సోద్, అనుపమ ఉపాధ్యాయ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సింగిల్స్ విభాగాల్లో భారత షట్లర్లు గత కొన్నాళ్లుగా ఆశించిన స్థాయిలో రాణించలేక చతికిల పడుతుండగా సింగపూర్ ఓపెన్‌లో వాళ్లకు కఠిన సవాల్ ఎదురుకానుంది. గత వారం మలేషియా మాస్టర్స్‌లో ఫైనల్ చేరిన కిడాంబి శ్రీకాంత్.. ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. మహిళల డబుల్స్‌లో భారత స్టార్ పెయిర్ త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల బరిలో ఉన్నారు.

తేజస్వినికి స్వర్ణం

ఢిల్లీ: జర్మనీలోని సుహ్ల్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత యువ షూటర్ తేజస్విని స్వర్ణంతో మెరిసింది. మహిళల 25 మీటర్ల పిస్టోల్ ఈవెంట్‌లో ఆమె 31 పాయింట్లు స్కోరు చేసి పసిడి కైవసం చేసుకుంది. సోమవారం ఇక్కడ జరిగిన ఫైనల్‌లో 8 మంది పాల్గొనగా తేజస్విని.. గురి తప్పని ప్రదర్శనతో అగ్రస్థానాన నిలవగా బెలారస్ షూటర్ అలినా 29 పాయింట్లతో రజతం, మిరియమ్ జాకొ (హంగేరి) 23 పాయింట్లతో కాంస్యం సొంతం చేసుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 575 పాయింట్లు స్కోరు చేసి ఫైనల్‌కు అర్హత సాధించిన 20 ఏండ్ల ఈ హర్యానా అమ్మాయి.. తుది పోరులోనూ రాణించింది. తేజస్విని స్వర్ణంతో ఈ టోర్నీ పాయింట్ల పట్టికలో భారత్ మొత్తం 11 పతకాలతో అగ్రస్థానంలో నిలవడం విశేషం.

టార్గెట్ టీ20 వరల్డ్ కప్

ఢిల్లీ: వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించబోయే టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా తరపున ఆడటమే తన లక్ష్యమని స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. ఆస్ట్రేలియా వేదికగా 2022లో ముగిసిన టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓడాక మెన్ ఇన్ బ్లూకు మళ్లీ పొట్టి ఫార్మాట్‌లో ఆడని రాహుల్.. జట్టులోకి రీఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నాడు. ఇదే విషయమై అతడు ఓ స్పోర్ట్స్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'అవును. వచ్చే ఏడాది జరుగబోయే టీ20 ప్రపంచకప్ నా మైండ్‌లో ఉంది. నేను మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నా. కానీ ఇప్పటికైతే నేను నా ఆటను ఆస్వాదిస్తున్నా' అని తెలిపాడు. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన రాహుల్.. 13 మ్యాచ్‌లలో 149 సగటుతో 539 పరుగులు చేశాడు. గత ఆరు సీజన్లలో రాహుల్.. ఐదుసార్లు 500 పరుగుల మార్కును దాటాడు.

టాప్ లేపిన కింగ్స్

ముంబైపై పంజాబ్ గెలుపు • ఇంగ్లిస్, ప్రియాన్ష్ సూపర్ షో • సూర్య మెరుపులు వృథా


ఆర్య (62)

ఇంగ్లిస్ (73)

ముంబై: ఐపీఎల్-18లో సమిష్టి ప్రదర్శనతో ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకున్న పంజాబ్ కింగ్స్ మరో స్ఫూర్తివంతమైన ఆట తీరుతో సత్తా చాటింది. లీగ్ దశలో తాము ఆడిన ఆఖరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాని (19 పాయింట్లతో)కి దూసుకెళ్లింది. సోమవారం జైపూర్‌లో ముంబైతో జరిగిన మ్యాచ్‌లో శ్రేయాస్ సేన.. ముంబైని ఏడు వికెట్ల తేడాతో గెలిచి లీగ్ దశను విజయంతో ముగించింది. ముంబై నిర్దేశించిన 185 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 18.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. జోష్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 73, 9 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 62, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరబాదుడు బాది ముంబై టాప్-2 ఆశలపై నీళ్లు చల్లారు. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. సూర్యకుమార్ యాదవ్ (39 బంతుల్లో 57, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది.

ప్రియాన్ష్, ఇంగ్లిస్ జోరు

ఛేదనలో కింగ్స్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (13) క్రీజులో నిలిచేందుకు ఇబ్బందిపడుతూ ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లోనే నిష్క్రమించినా మరో ఓపెనర్ ప్రియాన్ష్ అండగా మూడో స్థానంలో వచ్చిన ఇంగ్లిస్ చెలరేగిపోయాడు. ప్రియాన్ష్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా క్రీజులో కుదురుకున్నాక ఇంగ్లిస్ జోరు పెంచాడు. అశ్వని ఓవర్లో హ్యాట్రిక్ బౌండరీలు బాదిన ఇంగ్లిస్.. హార్దిక్ ఓవర్లో సింగిల్ తీసి ఫిఫ్టీ పూర్తిచేశాడు. ఇదే ఓవర్లో ప్రియాన్ష్.. 4, 6తో హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో వికెట్‌కు ఈ ఇద్దరూ 59 బంతుల్లో 109 రన్స్ జోడించి కింగ్స్‌ను గెలుపు దిశగా తీసుకెళ్తుండగా ఎట్టకేలకు శాంట్నర్ 15వ ఓవర్లో ప్రియాన్ష్‌ను ఔట్ చేశాడు. విజయం ముంగిట ఇంగ్లిస్ కూడా నిష్క్రమించినా శ్రేయాస్ (26*), వధేర (2*) లాంఛనాన్ని పూర్తిచేశారు.

నిలబడ్డ సూర్య

ఈ సీజన్‌లో టాప్ ఫామ్‌లో ఉన్న సూర్య మరోసారి ముంబై ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా మారాడు. ఓపెనర్లు రోహిత్ (24), రికెల్టన్ (27) ఫర్వాలేదనిపించినా ఆశించిన స్థాయిలో మెరుపులు మెరిపించలేదు. రికెల్టన్ ఆరో ఓవర్లో యాన్సెన్ బౌలింగ్‌లో శ్రేయాస్‌కు క్యాచ్ ఇవ్వడంతో సూర్య క్రీజులోకి వచ్చాడు. అతడు జెమీసన్ 9వ ఓవర్‌లో 6, 4, 4తో స్కోరువేగం పెంచాడు. కానీ బ్రర్ మరుసటి ఓవర్లో రోహిత్‌ను ఔట్ చేశాడు. తిలక్ (1), విల్ జాక్స్ (17) నిరాశపరచగా మిడిల్ ఓవర్స్‌లో పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో ముంబై ధాటిగా ఆడలేకపోయింది. కానీ హార్దిక్ (26) రెండు బౌండరీలు, రెండు సిక్సర్లతో ముంబై ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. అయితే అతడు యాన్సెన్ ఓవర్లో నిష్క్రమించినా ఆఖర్లో నమన్ (20)తో కలిసి సూర్య మెరుపులు మెరిపించి ముంబైకి పోరాడే స్కోరును అందించాడు.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
పంజాబ్ ✓	14	9	4	1	19	0.37
గుజరాత్ ✓	14	9	5	0	18	0.60
బెంగళూరు ✓	13	8	4	1	17	0.25
ముంబై ✓	14	8	6	0	16	1.14
ఢిల్లీ X	14	7	6	1	15	0.01
హైదరాబాద్ X	14	6	7	1	13	-0.24
లక్నో X	13	6	7	0	12	-0.33
కోల్‌కతా X	14	5	7	2	12	-0.25
రాజస్థాన్ X	14	4	10	0	8	-0.54
చెన్నై X	14	4	10	0	8	-1.03

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

వరల్డ్ యూత్ గేమ్స్‌కు చికీత

ఆగస్టులో కెనడాకు వెళ్లనున్న పెద్దపల్లి క్రీడాకారిణి

దేశంలో ఎంపికైన ముగ్గురిలో ఒకరు

పెద్దపల్లి, మే 26 (నమస్తే తెలంగాణ) : ఇటీవలి కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికీత.. సోమవారం వరల్డ్ యూత్ గేమ్స్‌కు ఎంపికైంది. ఈ నెల 21-25వ మధ్య పుణెలోని ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ (ఏఎస్ఐ)లో ట్రయల్స్ జరగగా, ఆర్చరీ కాంపౌండ్‌లో దేశం నుంచి ముగ్గురు ఆర్చర్లు వరల్డ్ యూత్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. వారిలో పర్నీత్ కౌర్(పంజాబ్), దీక్షల్(మహారాష్ట్ర)తో పాటు చికీత ఒకరు. ఈ ముగ్గురూ ఆగస్టులో కెనడా వెళ్లనున్నారు. ఇటీవల చైనాలోని అవైన్‌లో జరిగిన స్టేజ్-2 పోటీల్లో ప్రపంచంలోని 30దేశాలు పాల్గొనగా, తెలంగాణ నుంచి చికీత, ఆంధ్రప్రదేశ్ నుంచి జ్యోతి సురేఖ, మహారాష్ట్ర నుంచి మధుర పాల్గొని భారత్‌కు సిల్వర్ మెడల్‌ను తెచ్చారు. ఇప్పుడు వరల్డ్ యూత్ గేమ్స్‌కు సైతం చికీత ఎంపిక కావడంపై పెద్దపల్లి జిల్లా వాసులు, క్రీడాభిమానాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాంపియన్ల శుభారంభం

రెండో రౌండ్‌కు అల్కరాజ్, స్వియాటెక్ • ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగిన కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్), ఇగా స్వియాటెక్ (పోలండ్) తొలి రౌండ్ విజయాలతో టోర్నీలో శుభారంభం చేశారు. సోమవారం జరిగిన మొదటి రౌండ్ పోటీలలో ఈ ఇద్దరూ తమ ప్రత్యర్థులను చిత్తు చేసి తదుపరి రౌండ్‌కు ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అల్కరాజ్.. 6-3, 6-4, 6-2తో జెప్పిరి (ఇటలీ)పై అలవోక విజయం సాధించాడు. గేమ్‌లో 31 విన్నర్లు కొట్టిన నయా స్పెయిన్ బుల్.. 14 సర్వీస్ గేమ్‌లను గెలుచుకుని అరగంటలోనే ఆటను ముగించాడు. మహిళల సింగిల్స్‌లో స్వియాటెక్.. 6-3, 6-3తో రెబెక స్రమకోవ (స్లోవేకియా)పై గెలిచింది. వరుస సెట్లలో నెగ్గినా గెలుపు కోసం స్వియాటెక్ గంటా 24 నిమిషాల పాటు చెమటోడ్చక తప్పలేదు. మ్యాచ్‌లో 25 విన్నర్లు కొట్టిన ఈ పోలండ్ అమ్మాయి.. 17 తప్పిదాలు చేసి తడబాటుకు గురైనా మ్యాచ్‌ను కాపాడుకుంది. రెండో రౌండ్‌లో స్వియాటెక్.. ఇంగ్లండ్ అమ్మాయి ఎమ్మా రడుకానుతో తలపడనుంది.

ఒసాకాకు షాక్

మిగిలిన మ్యాచ్‌ల విషయానికొస్తే మహిళల సింగిల్స్‌లో నవోమి ఒసాకా (జపాన్).. 7-6 (7/1), 1-6, 4-6తో బడోస (స్పెయిన్) చేతిలో ఓడి మరోసారి తొలిరౌండ్‌కే ఇంటిబాట పట్టింది. రడుకాను, రిబాకినా (కజకిస్థాన్), కొలిన్స్ (అమెరికా) తొలి రౌండ్ విఘ్నాలను అధిగమించారు. పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), బెన్ షెల్టన్ (అమెరికా), సిట్సిపస్ (గ్రీస్) రెండో రౌండ్‌కు దూసుకెళ్లగా నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (యూఎస్)కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది.

కన్నప్పలో..చివరి 50నిమిషాలు

మహాపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'. శివలీలలే ప్రధానాంశమైన ఈ సినిమాలో దైవికంగా వచ్చే వివిధరూపాలలో దేశంలోనే పేరెన్నికగన్న పెద్ద పెద్ద స్టార్లే నటించారు. వారిలో ప్రభాస్ ఒకరు. రీసెంట్‌గా ఇందులోని ప్రభాస్ పాత్ర గురించి మంచు విష్ణు మాట్లాడుతూ 'ముందు ప్రభాస్‌ని అతిథిపాత్రకు అనుకున్నాం. తర్వాత 30 నిమిషాలు పెంచాల్సొచ్చింది. మొత్తంగా చివరి 50 నిమిషాల్లో ప్రభాస్ కనిపిస్తారు. ప్రభాస్, మా నాన్న మోహన్‌బాబుగారు మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. ప్రభాస్ కెరీర్‌లోనే నటనపరంగా 'కన్నప్ప' బెస్ట్ మూవీ అవుతుంది. ఈ సినిమా ఈ స్థాయికి రావడానికి కారణం ప్రభాస్. ఇందులో గెస్ట్‌గా చేయాలి.. అని అడగ్గానే వెంటనే అంగీకరించాడు. రక్తం పంచుకొని పుట్టకపోయినా ప్రభాస్ నా మంచిని కోరాడు. 'కన్నప్ప' పెద్ద హిట్ అవుతుందని ప్రతిసారీ చెబుతూనే ఉన్నాడు. గతంలో నా సినిమాల విడుదలకు ముందు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టనా అని అడిగేవాడు. ఈ రోజుల్లో అలా ఎవరుంటారు? అందుకే ప్రభాస్‌కి జీవితాంతం రుణపడి ఉంటా.' అంటూ చెప్పుకొచ్చారు మంచు విష్ణు. ఇందులో ప్రభాస్ 'నందీశ్వరుడు'గా కనిపిస్తాడని తెలుస్తున్నది. శివుని వాహనమైన నంది.. శివకార్యం కోసం మానవరూపంలో భూమిమీదకు దిగితే ఎలా ఉంటుందో ప్రభాస్ పాత్ర చెబుతుందని ఇన్‌సైడ్ టాక్. జూన్ 27న విడుదల కానున్న ఈ సినిమాకు ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఫైనల్ కట్ చూశాను.. అదిరిపోయింది

'ప్రేక్షకులకు అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. ఒక మంచి సినిమాలో నటించామనే తృప్తి మా అందరిలో ఉంది. ఇష్టంతో కష్టపడి ఈ సినిమా చేశాం. దర్శకుడు విజయ్ కనకమేడల హార్డ్ వర్క్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. రీసెంట్‌గా ఫైనల్ కట్ చూశాను. అదిరిపోయింది. మే 30 మనందరికీ పెద్ద పండుగ. సక్సెస్‌మీట్‌లో కలుద్దాం.' అని హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ అన్నారు. ఆయన, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా రూపొందిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మాట్లాడారు. అగ్ర నిర్మాత బెల్లంకొండ సురేశ్, అగ్ర దర్శకులు సంపత్‌నంది, అనిల్ రావిపూడి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా వల్ల సాయితో, రోహిత్‌తో నా బంధం బలపడింది. అలాగే ఆనంది, అదితిలతో కలిసి పనిచేయడం గొప్ప ఎక్స్‌పీరియన్స్. మేం సక్సెస్‌లో ఉన్నామా? సినిమాలు చేస్తున్నామా? ఈవేమీ చూడకుండా కేవలం మాపై నమ్మకంతో కె.కె.రాధామోహన్ ఈ సినిమా నిర్మించారు. విజయ్ కనకమేడల డెడికేషన్ ఉన్న డైరెక్టర్. ఈ సినిమా విజయం కోసం మేమంతా వేయికళ్లతో ఎదురుచూస్తున్నాం. సినిమా బాగా వచ్చింది. ఆదరిస్తారని నా నమ్మకం' అని మంచు మనోజ్ చెప్పారు. ఈ సినిమాతో దర్శకుడు విజయ్ కనకమేడల కచ్చితంగా కమర్షియల్ డైరెక్టర్ స్థాయికి ఎదుగుతాడని, ఈ సినిమా పెద్ద విజయం సాధించి, నిర్మాత రాధామోహన్‌కి లాభాలు తెచ్చిపెట్టాలని, తనకు జీవితాంతం మరిచిపోలేని జ్ఞాపకం ఈ సినిమా అని నారా రోహిత్ తెలిపారు.

పవన్ సినిమాను ఆపే దమ్ము ఎవరికీ లేదు

ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే , బంద్ వార్త మిస్‌కమ్యూనికేట్ అయింది

మీడియాతో నిర్మాత దిల్‌రాజు



అగ్ర హీరో, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమకు పెద్దన్నలాంటివాడని, ఆయన తిడితే పడతామని, పవన్ హర్ట్ అయ్యారు కాబట్టి తిట్టే అధికారం ఆయనకుందని అన్నారు ప్రముఖ నిర్మాత దిల్ రాజు. తెలుగు సినీరంగానికి, ఏపీ ప్రభుత్వానికి మధ్య చోటుచేసుకున్న తాజా వివాదం నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో దిల్‌రాజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇండస్ట్రీకి చెందిన వారెవరూ ఇప్పటివరకు ఏపీ ముఖ్యమంత్రిని కలవలేదని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై దిల్‌రాజు పైవిధంగా స్పందించారు. ఇక్కడ (ఇండస్ట్రీలో) ఎవరి దారి వారిదేనని, ఏమైనా సమస్యలొస్తేనే ప్రభుత్వాన్ని, ఛాంబర్‌ను ఆశ్రయిస్తారని దిల్ రాజు అన్నారు. 'తమ డిమాండ్‌లు నెరవేరకుంటేనే బంద్ చేస్తామని ఎగ్జిబిటర్లు చెప్పారు. అంతలోనే జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ అంటూ బ్రేకింగ్ న్యూస్ వచ్చాయి. ఆ వార్తలను ఎగ్జిబిటర్లు, ఛాంబర్ ఖండించలేదు. ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే. ఇండస్ట్రీలో ఉన్న అందరం కలిసి కదా మీడియాతో మాట్లాడాల్సింది. అంతా కలిసి మాట్లాడాలంటే మాకు భయం' అని దిల్‌రాజు చెప్పారు. ఇరవైఏళ్లుగా తాను పవన్‌కల్యాణ్‌ను చూస్తున్నానని, ఆయనకు ఆగ్రహం తెప్పించేలా పరిస్థితులు ఏర్పడ్డాయని, పవన్ చిత్రాన్ని ఉద్దేశ్యపూర్వకంగా టార్గెట్ చేశారంటూ దుష్ప్రచారం జరిగిందని, అయితే వాస్తవాలు వేరుగా ఉన్నాయన్నారు. 'థియేటర్స్ బంద్ అనే వార్త రాంగ్‌గా కమ్యూనికేట్ అయింది. తూర్పు గోదావరిలో మొదలైన సమస్యను తెలంగాణకు ఆపాదించారు. ఏప్రిల్ 19న తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు మీటింగ్ జరిపారు. పర్సంటేజీ విధానం బాగుంటుందని ఎగ్జిబిటర్లు కోరారు. డిస్ట్రిబ్యూటర్లు అంగీకారం చెప్పలేదు. సరిగ్గా అదే సమయంలో 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఆ తర్వాత వాయిదా వేశారు. పర్సంటేజీల సమస్య ఈస్ట్ గోదావరిలో మొదలై తెలంగాణ దాకా వచ్చింది. ఈ అంశాన్ని ఇక్కడి ఎగ్జిబిటర్లు శిరీష్ దృష్టికి తీసుకొచ్చారు. మే 18న ఛాంబర్ మీటింగ్ జరిగింది. చివర్లో నేను అక్కడకు వెళ్లాను. జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేస్తామని ఎగ్జిబిటర్లు చెబితే వద్దని వారించాను. అందరూ నాతో ఏకీభవించారు. పర్సంటేజీల విషయంలో ఎగ్జిబిటర్లు ఛాంబర్‌కు లేఖ రాశారు. వాళ్లు అనుకున్నది జరగకపోతే బంద్ చేస్తామన్నది ఆ లేఖ సారాంశం. కానీ బయట జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన నిర్మాతల మీటింగ్‌లో ఎగ్జిబిటర్లకు సమస్యలున్నాయని అందరూ చెప్పారు. జాయింట్ మీటింగ్‌లో స్పష్టతనిద్దామని అనుకునేలోగా 'హరిహరవీరమల్లు' సినిమాపై ఇష్యూ డైవర్ట్ అయింది. పవన్‌కల్యాణ్ సినిమాను ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. ఒక్క కోవిడ్ సమయంలో తప్పితే థియేటర్ల బంద్ అనేది నా అనుభవంలో ఎప్పుడూ చూడలేదు' అని దిల్ రాజు పేర్కొన్నారు.

నైజాంలో మాకున్న థియేటర్లు 30 మాత్రమే

నైజాంలో 370 సింగిల్ స్క్రీన్స్ థియేటర్లు ఉంటే అందులో తమ సంస్థ ఎస్వీసీఎస్‌కు 30 మాత్రమే ఉన్నాయని, ఏషియల్, సురేష్ కంపెనీలో 90 వరకూ ఉన్నాయని దిల్‌రాజు చెప్పారు. '250 థియేటర్లను యజమానులే నడుపుకుంటున్నారు. అయినా 'ఆ నలుగురు' అంటూ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో ఇక్కడ స్పష్టతనిస్తున్నా. ఉత్తరాంధ్రలో మాకు డిస్ట్రిబ్యూషన్ ఆఫీసు ఉంది. అక్కడ 20 థియేటర్లు ఉన్నాయి. ప్రస్తుతం రెండు ప్రభుత్వాలు ఇండస్ట్రీకి అండగా ఉన్నాయి. ఇండస్ట్రీకి ఏ సమస్య వచ్చినా ప్రభుత్వాలే పరిష్కరించాలి. ఇంతటితో ఈ వివాదానికి ముగింపు పలుకుతారని ఆశిస్తున్నా' అని దిల్‌రాజు అన్నారు.

అనగనగా ఒక సంక్రాంతి రాజు

హీరో నవీన్ పోలిశెట్టి ప్రస్తుతం 'అనగనగా ఒక రాజు' అనే కామెడీ ఎంటర్టైనర్‌లో నటిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. సోమవారం మోషన్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ ఏడాది సంక్రాంతికి మా సంస్థ నుంచి వచ్చిన 'డాకు మహారాజ్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని నమోదు చేసింది. ఆ సెంటిమెంట్‌ని కొనసాగిస్తూ వచ్చే ఏడాది సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' సినిమాను విడుదల చేస్తున్నాం. వచ్చే సంక్రాంతికి హీరో నవీన్ పోలిశెట్టి నవ్వుల పండుగను తీసుకురాబోతున్నాడని మోషన్ పోస్టర్‌తోనే అర్థమైంది. రేపు పండక్కి రానున్న అసలుసిసలు సంక్రాంతి సినిమా ఇది.' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి నిర్మాణం: సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూర్ ఫోర్ సినిమాస్.

ప్రతీకార కథతో 'డెకాయిట్'

అడివి శేష్ హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ చిత్రం 'డెకాయిట్' గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పాన్ ఇండియా చిత్రానికి షానియల్ డియో దర్శకుడు. మృణాల్ ఠాకూర్ కథానాయిక. నాయకానాయికలు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య భావోద్వేగభరిత సంభాషణతో మొదలైన గ్లింప్స్ ఆసక్తికరంగా సాగింది. 'నేను మోసగించడానికి రాలేదు. అంతకంటే ఎక్కువ చేస్తా' అంటూ మిస్టీరియస్ స్మైల్‌తో అడివి శేష్ చెప్పిన డైలాగ్ కథపై ఇంట్రెస్ట్‌ను పెంచింది. ఓ ఎపిసోడ్‌లో ఆయన ఖైదీ దుస్తుల్లో కనిపించారు. ప్రేమ, ప్రతీకారం, మోసం అంశాల కలబోతగా సాగే థ్రిల్లర్ చిత్రమిదని, అడివి శేష్ ఇంటెన్స్ అండ్ రగ్గ్‌డ్ పాత్రలో కనిపిస్తారని, మృణాల్ ఠాకూర్ పాత్ర సైతం శక్తివంతంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.

యుద్ధం, జూదం ఒకటే!

సంగీత్ శోభన్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకుడు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మాతలు. జూన్ 6న విడుదలకానుంది. టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. 'యుద్ధం, జూదం ఒక్కటే. యుద్ధం ఎక్కడ మొదలుపెట్టాలో తెలియాలి. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి.' అంటూ సాగే సంభాషణతో ఈ టీజర్ మొదలైంది. ఇందులో సంగీత్‌శోభన్ ఓ గ్యాంబ్లర్‌గా కనిపించబోతున్నారని టీజర్ చూస్తే అర్థమవుతున్నది. సినిమాలోని ముఖ్యపాత్రలన్నీ టీజర్‌లో పరిచయమయ్యాయి. మిస్టరీ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాలనూ అలరిస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్ను, సాయిశ్వేత, జస్విక, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రేమ్ సాగర్, సంగీతం: శశాంక్ తిరుపతి.

రెండోమారు తెలంగాణ ఆడపడుచుగా?

'మహానటి' సావిత్రిగా శిఖర సమానమైన అభినయాన్ని ప్రదర్శించిన కీర్తిసురేష్.. 'సర్కారువారి పాట'లో కళావతిగా యువతరం కంటికి కునుకు లేకుండా చేశారు. నటిగా ఈ పొంతన లేని కోణాలు ఆమెను నిజంగానే మహానటిని చేశాయి. ప్రస్తుతం అటు సినిమాలు, ఇటు వెబ్ సిరీస్‌లు అంటూ క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిస్తున్నారు కీర్తి సురేష్. చెన్నయ్ టూ ముంబై వయా హైదరాబాద్.. ఇది ప్రస్తుతం కీర్తి సురేశ్ పరిస్థితి. 'అక్క' అనే వెబ్ సిరీస్‌తో పాటు, తమిళంలో 'రివాల్వర్ రీటా' అనే సినిమా కూడా చేస్తున్నారు. ఇక తెలుగులో 'బలగం'ఫేం వేణు యల్దెండి దర్శకత్వంలో రూపొందనున్న 'ఎల్లమ్మ'లో టైటిల్ రోల్ కీర్తి సురేషే అని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్త బలంగా వినిపిస్తున్నది. ఇప్పటికే 'దసరా' సినిమాలో తెలంగాణ మహిళగా అద్భుతంగా నటించారు కీర్తి. ఇప్పుడు 'ఎల్లమ్మ'గా ఆమె ఖరారైన మాట నిజమైతే.. రెండోసారి తెలంగాణ పడుచుగా కనిపిస్తారన్న మాట. వేణు యల్దెండి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం తెలంగాణ సంస్కృతి, నమ్మకాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తున్నది. వచ్చే నెలలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుకానున్నదట.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.